ఇసుక మేటలతో వాగులు ఖాళీచేస్తే ఊరుకోం..

- అనుమతులు లేని చోట ఇసుక తీసివేతపై ఫిర్యాదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం



రంబోజీగూడెం చెక్‌డ్యామ్‌ను పరిశీలింస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



చెక్‌డ్యామ్‌లో అదనపు కలెక్టర్‌కు బోరును చూపిస్తున్న రైతులు

దేవరుప్పుల: భూగర్భజలాల పెంపునకు అత్యంత దోహదపడే ఇసుకను మైనింగ్ అధికారుల తప్పుడు నివేదికల ఆధారంగా తొలగిస్తే ఊరుకోమని చిన్న మడూరు రెవెన్యూ గ్రామాల వాగు పరివాహక రైతులు ఆందోళనల మధ్య జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు గోడువెలిబుచ్చుకున్నారు. మంగళవారం మండలంలోని రంబోజీగూడెం చెక్‌డ్యామ్‌లో నుంచి గత రెండు రోజులుగా ఇసుక మేటల పేరిట వచ్చిన అనుమతులతో చెన్నూరు రిజర్వాయర్‌కు ఇసుక తరలింపును వ్యతిరేకిస్తూ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌భాషాకు వినతి పత్రం ఇవ్వగా స్పందించిన ఆయన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రంబోజీగూడెం వాగులో చెక్‌డ్యామ్ ఏరియా పరిశీలనకు రోహిత్‌సింగ్ రాగా రిజర్వాయర్లకు గోదావరి ఇసుక తెచ్చుకోవాల్సి ఉండగా ఇక్కడి ఇసుకను కాంట్రాక్టర్‌లకు తేరగా తరలించడం అన్యాయమని రైతులు వివరించారు. గత ప్రభుత్వం నీటి ప్రవాహాన్ని ఆపి ఇంకుడు గుంతల మాదిరిగా తమ ఏరియాలో నీటి నిల్వలు పెంచేందుకు కట్టిన చోట ఇసుక మేటలు వేసిందని మైనింగ్ అధికారులు తప్పుడు నివేదికలతో అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికే తమ చేతి బోర్లు ఎత్తిపోయాయని పలు చోట్ల చూపించారు. గత రెండు రోజులుగా ఇసుక తరలించగా తేలిన మట్టి ఆనవాళ్లను చూపిస్తూ రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మైనింగ్ అధికారులను అనుమతి మార్కింగ్ చూపించమని ఆదేశించినా చాకచక్యంగా వారు దాటవేశారు. ఇక్కడి వాస్తవిక పరిస్థితులు చూసేందుకు వచ్చానని, వాగు పరివాహక రైతులు మీ అభిప్రాయాలను బేషరతుగా చెప్పండి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని అదనపు కలెక్టర్ అన్నారు. విచారణ సందర్భంగా గతంలో బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా ఇసుక తరలించిన విషయం ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకోగా పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చెన్న కేశవులు ఇరువురికి సర్దిచెప్పి విచారణకు సహకరించాలని సూచించడంతో గొడవ సద్దుమణిగింది. తహసీల్దార్ హుస్సేన్, రాజు, ఆంద్రయ్య, మైనింగ్ ఏడీఈ విజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ ఈఈ ప్రవీణ్, డీఈ శ్రీకాంత్, ఏఈ విద్యాసాగర్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



రఘునాథపల్లి: బడీడు పిల్లలందరినీ నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండలంలోని వెల్ది ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు మనోహర్, భాస్కరాచారి అన్నారు. మంగళవారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి చిన్నారులను బడిలో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వ బడుల్లో కల్పించే సౌకర్యాలను వివరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని, బడీడు పిల్లలు బడిబయట ఉండకూడదని సూచించారు. కాంప్లెక్స్ సీఆర్‌పీ కనకయ్య, కారోబార్ భిక్షపతి, అంగన్‌వాడీ టీచర్లు రజిత, యాదలక్ష్మి, లావణ్య ఇందిర, సంధ్యారాణి తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన నిమ్మతి మహేందర్‌రెడ్డి



జనగామ: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ టెస్కాబ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మంగళవారం జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి సత్కరించారు.

రైతు వినతికి అదనపు కలెక్టర్ సత్వర చర్యలు

దేవరుప్పుల: రంబోజీగూడెం చెక్‌డ్యామ్ సందర్శనకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు స్థానిక రైతు గైని రమేశ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నారుమడి ఎండిపోతుందని విన్నవించగా సత్వర చర్యలకు ఆదేశించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి వివరణ కోరగా ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా మరమ్మతుల కోసం సింగరాజుపల్లి మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లామని, అధనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ రైతు నారుమడి అవసరం దృష్ట్యా యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

జనగామ రూరల్: కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన ఘటన మంగళవారం మండలంలోని గానుగుపహడ్‌లోని ఏసీ రెడ్డి నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఉరుముల మేరుపులు రాగా ఏసీ రెడ్డి నగర్‌లో వ్యవసాయం పొలంలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు అంటుకొని కొమ్మలు కాలిపోయాయి.

దాడి అమానుషం

నర్మెట: యాదాద్రి జిల్లా నారాయణపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ లింగస్వామిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలంటూ మండల ఫొటోగ్రాఫర్స్ నర్మెట చౌరస్తాలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ కుటుంబ బరోసా జిల్లా ఇన్‌చార్జ్ వలబోజు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపగోని శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమాలకు పిలిచి అవమానించడం, చేయి చేసుకోవడం దురదృష్టకరమన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వలబోజు రమేష్, ఉపాధ్యక్షుడు గుండేటి రామచందర్, బొడికె వినోద్, కొంపెల్లి భాస్కర్, గొలుసుల కరుణాకర్, కంతి చరణ్ ఉన్నారు.

పరామర్శ

నర్మెట: మండలంలోని ఆగాపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ గోరంతల కార్తీక్ తండ్రి వెంకటయ్య (70) గుండెపోటుతో మంగళవారం తెల్లవారు జామున మృతిచెందాడు. కాగా మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ యూనియన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పరామర్శించి రూ. 5 వేల సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరుకు చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు కుక్కల రాజు మృతి చెందాడు. కాగా మంగళవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వంగ దశరథ, నాగరాజు తదితరులు ఉన్నారు.

అన్నదానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీటీసీ గన్ను నర్సింహులుగుప్తా, కళావతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్నదానం చేశారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల మధ్య ఎంపీటీసీ దంపతులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది ఎంపీటీసీ దంపతులను శాలువాతో సన్మానించారు.

చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాలకు శ్రేష్ట అవార్డు



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శ్రేష్ట అవార్డు లభించింది. 2003–24 విద్యాసంవత్సరంలో 10వతరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థి గద్దం నవ్య సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు, హెచ్ఎం సంపత్ శ్రేష్ట పాఠశాల ప్రతిభా పురస్కార అవార్డు పొందారు. ఈ మేరకు సోమవారం రాత్రి హైదరాబాదులోని రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్‌రావు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలి



రఘునాథపల్లి: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



లింగాలఘణపురం: సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

రఘునాథపల్లి: ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాలు, తాగు నీరు సక్రమంగా వస్తుందా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు.. జీపీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని రఘునాథపల్లి, వెల్ది, ఖిలాషాపూర్‌లో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయి సర్వేలో ప్రతి నల్లా కనెక్షన్‌లో కుటుంబ సభ్యుల సంఖ్య, ఆధార్, ఫోన్ నంబర్లు యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరితగతిని సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సాయిబాబా, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

భగీరథ నల్లాలపై ఇంటింటా సర్వే

లింగాలఘణపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటా సర్వే నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ జలేందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీన్ కుమార్, కారోబార్ సురేశ్‌తో పాటు వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: గ్రామాల్లో ఇంటింటా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాలు తెలుసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. మంగళవారం గ్రామాల్లో సర్వే చేపట్టి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టు వెంట్రుకల కోసం వెళ్లి గుండెపోటుతో మృతి



వినయ్(ఫైల్)

జనగామ: సోదరుడి కూతురు, కుమారుడు పుట్టు వెంట్రుకలు తీసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్లిన బొట్ల వినయ్ (23) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని ధర్మకంచకు చెందిన వినయ్ తల్లిదండ్రులు బొట్ల ఇస్తారి, లక్ష్మి, అన్న శివ కుమార్ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వినయ్ ఈనెల 10న వేములవాడకు వెళ్లారు. మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తుండగా వినయ్ గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబీకులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వినయ్ మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చేప పిల్లల పంపిణీ ఎప్పుడో?

చిల్పూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ ఎప్పుడు చేస్తుందో ప్రకటించాలని మత్స్య శాఖ జిల్లా అధ్యక్షుడు నీల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు 2016లో మాజీ సీఎం కేసీఆర్ ఉచిత చేపపిల్లల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదని, ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియజేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘ నాయకులు

జఫర్‌గఢ్: రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగల యాదగిరి, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు ఏదునూరి నరేష్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రసిడెంట్ సాంబరాజు రవి ప్రథమ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. సాంబరాజు రవి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్‌గా రజకుల కోసం చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ తాటికాయల అశోక్, చిట్యాల ఐలమ్మ మనుమలు చిట్యాల రామచంద్రం, సంపత్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, నాయకులు సాంబరాజు కుమార్, జలేంధర్, వీరన్న, యుగేందర్, యాదగిరి, రాములు, రాపర్తి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్: బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన పులి యాకయ్య అనారోగ్య సమస్యతో నిమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.లక్ష 75వేల ఎల్‌ఓసీని హనుమకొండలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు శ్రీరాముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రామిని హరీష్ సత్కారం



చంద్రబాబుతో రామిని హరీష్

జనగామ: ఏపీ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న క్రమంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఆ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం హరీష్ మాట్లాడారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పార్టీకి పూర్తి పట్టు ఉందని తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిషలు కృషి చేసేందుకు శ్రేణులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో ఉంచుతామన్నారు. మెజార్టీ స్థానాలను గెలుచుకునేలా క్షేత్ర స్థాయిలో పని చేస్తామని చెప్పారు. అందుకు సంబంధించి ఇప్పటి నుంచే కార్యాచరణ మొదలుపెడతామని తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



స్టేషన్‌ఘన్‌పూర్: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఏఎంఓ శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తారని, ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం నుంచి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల నోడల్ అధికారి కొమురయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు రవికుమార్, శారోన్, గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి, అశోక్‌కుమార్, నీలకంఠం, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, లవన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పాఠ్యపుస్తకాల పంపిణీ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించేందుకు మంగళవారం ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి ఉపేందర్ మాట్లాడారు. హెచ్ఎంలు కళావతి, సజ్జన్‌కుమార్, ప్రభాకర్, జోగు వరప్రసాద్‌రావు, లలిత, విజయ, ప్రవీణ్‌కుమార్, దారావత్ వెంకన్న, ఎంఐఎస్ కోఆర్డినేటర్ గోలి రవీందర్‌రెడ్డి, నర్సింహ్మలు, యాకస్వామి పాల్గొన్నారు.

యూనిఫామ్‌ల పంపిణీ..

చిల్పూరు: పాఠశాలలో కొత్తగా చేరే, పాత విద్యార్థులకు ఉచిత యూనీఫామ్‌లను అందజేస్తున్నట్లు విద్యాశాఖ మండల నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు యూనీఫామ్‌లు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఎం రవిబాబు, ఉపాధ్యాయులు శ్రీదేవి, రమేష్, కల్యాణి, శోభారాణి, అంగన్‌వాడీలు మంతెన విజయరాణి, జ్యోతి , వీణ, రోజా పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో ఇంటి చుట్టూ పరిసరాలను గ్రామస్తులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో పలు వీధుల్లో మంగళవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. పిచ్చి మొక్కలు లేకుండా చూస్తూ మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కారోబార్ నాగయ్య, సిబ్బంది ఉన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, వ్యాధుల నివారణకు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పరిసరాల శుభ్రతను పాటించాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, మిషన్ భగీరథ ఏఈ ప్రజ్వల్ అధ్యక్షతన మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడారు. కార్యదర్శి శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, అరుణ, పద్మ,ర లలిత, సులోచన, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని తాటికొండ గ్రామంలో దొమ్మాట బుచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

కొనసాగుతున్న మరమ్మతు పనులు



తరిగొప్పులలో నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం



రాజీవ్‌నగర్ స్కూల్‌లో కనిపించని అభివృద్ధి పనులు



పిచ్చి మొక్కలతో నిండిన శివునిపల్లి ఎంపీపీఎస్



పోచన్నపేట ఉన్నత పాఠశాలలో నిలిచిన సంపు పనులు

జనగామ రూరల్: నేటి నుంచి (బుధవారం) పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 508 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా దాదాపుగా 32 వేల మందికి పైగా విద్యార్థుల చదువు కుంటున్నారు. అయితే అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 291 పాఠశాలలు ఎంపిక కాగా 194 పాఠశాలలో సివిల్ పనులు పూర్తయ్యాయి. 97 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. మూడు నెలల నుంచి పనులు జరుగుతున్న పూర్తి కాని పరిస్థితి. పాఠశాలలు ప్రారంభమయితే అటు అభివృద్ధి పనులు ఇటు తరగతుల నిర్వహణకు ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంది.



పట్టణంలో కోర్టు ఎదురుగా నిలిచిన బాలికల పాఠశాల భవనం పనులు



కన్నెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహణ లేని మరుగుదొడ్లు

న్యాయం చేయండి



పట్టా కాగితాలతో బాధితురాలు అనూష

చిల్పూరు: తమ భూమిలో పొలానికి నీరందించేందుకు పైపులైన్ వేసుకుంటే కొందరు వారి భూమిలో వేశారంటూ అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారని ఈవిషయంలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన శెట్టబోయిన అనూషజంపరాజు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం అనూష మాట్లాడారు. గ్రామ సమీపంలో 160 సర్వే నంబర్‌లో ఎకరం 7 గుంటలు, 161లో ఎకరం 21గుంటల భూమి తమ పేర పట్టా వ్యవసాయ భూమి ఉందని, నీరు పారించేందుకు నెల రోజుల క్రితం పొలంలో పైపులైన్ వేసుకున్నట్లు చెప్పారు. అయితే ఇదే గ్రామానికి చెందిన బాలమల్లయ్య, కృష్ణంరాజులు వారి భూమిలో పైపులైన్ వేశారని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పైపులైన్ విషయంలో పెద్దమనుషులను ఆశ్రయిస్తే వారు ఈనెల 14న పంచాయతీ ఏర్పాటు చేస్తామని, కేసు వాపస్ తీసుకోవాలని సూచించారన్నారు. అయినా వినకుండా తమపై దాడి చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

వివాదాస్పద భూమిలోకి వెళ్లొద్దు



వినతిపత్రం చూపిస్తున్న బాధితురాలు విమలమ్మ

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామ శివారులోని వివాదాస్పద భూమిలోకి ఎవరూ వెళ్లకూడదని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన బాధితురాలు రామగళ్ల విమలమ్మ.. తహసీల్దార్‌ను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చిన్నరామన్‌చర్ల గ్రామంలో 340, 342 సర్వేనంబర్లలోని ఏ. 05–16 గుంటల భూమిలోకి ఎవరూ వెళ్లి పనులు చేయొద్దని తెలిపారు. అందరికీ త్వరలో నోటీసులు అందిస్తామన్నారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితురాలు కుటుంబ సభ్యులు నర్సింహులు, పుష్ప ఉన్నారు.

నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల: నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన డబుల్‌బెడ్రూం ఇళ్లను నిబంధనలు విస్మరించి దురాక్రమణ చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ధర్మాపురం, కడవెండిలో పంపిణీ కాని డబుల్‌బెడ్రూం ఇళ్లలో చేరిన పలు కుటుంబాలకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. త్వరలో సంబంధిత అధికారులు గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నందున సత్వరమే ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. ఖాళీ చేయనట్లయితే సంబధిత అధికారుల ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.చెన్నకేశవులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎఎస్సై సదానందం, హెడ్‌కానిస్టేబుల్ సదయ్య తదితరులు ఉన్నారు.